# జనగణన ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి : కలెక్టర్



విశ్వంభర, కొల్లాపూర్: జనగణన నమోదు ప్రక్రియను పారదర్శకంగా నమోదు చేయాలని ఎన్యూమరేటర్లను జిల్లా కలెక్టర్ జీవీ హేమంత్ కేశవ్ పాటిల్ ఆదేశించారు. జనగణన నమోదు సందర్భంగా ప్రతి ఇంటి వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పెద్ద కొత్తపల్లి మండలం సాతాపూర్, కోడేరు మండలంలోని పసుపుల గ్రామాల్లో జరుగుతున్న 2027 జనగణన ప్రక్రియను జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ మంగళవారం పరిశీలించారు. సాతాపూర్ గ్రామంలో నల్ల శేఖర్ ఇంటిని సందర్శించిన కలెక్టర్, జనగణన సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ వివరాలు సేకరిస్తున్న విధానాన్ని ప్రత్యక్షంగా గమనించారు. ఈ సందర్భంగా జనగణన ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, కచ్చితత్వంతో నిర్వహించాలని అధికారులకు సూచించారు. అనంతరం పసుపుల గ్రామంలో జనగణన విధుల్లో పాల్గొంటున్న సూపర్వైజర్లు, ఎన్యూమరేటర్ల ఫోటో గుర్తింపు కార్డులను పరిశీలించారు. విధులు నిర్వహించే ప్రతి సిబ్బంది తప్పనిసరిగా ఐడెంటి కార్డులు ధరించి ప్రజల్లో విశ్వాసం కల్పించాలని, అలాగే గ్రామస్తులు కూడా అధికారిక గుర్తింపు కార్డులు ఉన్న సిబ్బందికే తమ వివరాలు అందించాలని కలెక్టర్ సూచించారు.జనగణన విధుల్లో పాల్గొంటున్న సిబ్బందితో మాట్లాడిన కలెక్టర్, జనగణన గ్రామాభివృద్ధికి కీలకమైన ప్రక్రియ అని పేర్కొన్నారు. ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితులపై ఖచ్చితమైన సమాచారం సేకరించడం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు మరింత సమర్థవంతంగా జరుగుతుందని తెలిపారు. ప్రతి ఇంటిని సందర్శించి కుటుంబ సభ్యుల వివరాలు, విద్య, ఉపాధి, నివాస పరిస్థితులు తదితర అంశాలను సమగ్రంగా నమోదు చేయాలని సూచించారు. ఏ కుటుంబం కూడా నమోదు కాకుండా మిగిలిపోకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, సేకరించిన సమాచా రాన్ని సకాలంలో డిజిటల్ విధానంలో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. జనగణన ప్రక్రియలో ప్రజల సహకారం అత్యంత అవసరమని, అందరూ నిజమైన వివరాలు అందించాలని, జనగణన నమోదు ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యల పై ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లను అడిగి తెలుసుకున్న కలెక్టర్, అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్దకొత్తపల్లి తహసీల్దార్ శ్రీనివాస్, కోడేరు తహసీల్దార్ జమీల్, సంబంధిత గ్రామాల రెవెన్యూ అధికారులు, వివిధ శాఖల అధికారులు, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

## యూరియా తగ్గించి జీవన ఎరువులు వాడాలి



విశ్వంభర, కరీంనగర్ : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గల వ్యవసాయ పరిశోధన స్థానం, కరీంనగర్ ఆధ్వర్యంలో రైతులకు మేలైన సాగు పద్దతుల పై అవగాహన కల్పించారు. వానాకాలం సాగుకు రైతులను సమాయత్తం చేసేందుకు వ్యవసాయ శాఖ వారితో కలిసి రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే వినూత్న కార్యక్రమాన్ని మంగళవారం సైదాపూర్ మండలంలోని ఆకునూరు గ్రామంలో నిర్వహించారు. ఏప్రిల్ 27 నుంచి మే 23 వరకు కొనసాగే ఈ ప్రత్యేక కార్యక్రమం ద్వారా వ్యవసాయ విజ్ఞానాన్ని నేరుగా క్షేత్రస్థాయిలోకి తీసుకువెళుతున్నారు. వ్యవసాయ పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్. ఇ. రజనీకాంత్ మాట్లాడుతూ తక్కువ యూరియా వాడండి సాగు ఖర్చుని తగ్గించండి, పంట వ్యర్థాలు కలియ దున్నడం ద్వారా నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడం, నీటి ఆదా చేయడం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల పై అవగాహన కలిగించారు. శాస్త్రవేత్త డా. ఇ.ఉమారాణి మాట్లాడుతూ మార్కెట్లో గిరాకీ ఉన్న వరి రకాలు సాగు, సేంద్రీయ వ్యవసాయం, పంట మార్పిడి, అవసరం మేరకే రసాయన ఎరువుల వాడకం అనే విషయాల పట్ల రైతులకు అవగాహన కల్పించారు. ఈ నెల రోజుల పాటు జిల్లాలో వివిధ గ్రామాల్లో జరిగే ఈ రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని రైతులందరూ వినియోగించుకోవాలన్నారు. నానో ఎరువుల వాడకం వలన జరిగే ప్రయోజనాలను మండల వ్యవసాయ అధికారి వైదేహి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు, వంశీ, రాజు, రజినీకాంత్, తిరుపతి, రైతులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్‌లో గాలివాన బీభత్సం



విశ్వంభర, ఆదిలాబాద్ :ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవె ల్లి, బజార్‌హత్నూర్, ఇచ్చో డ, ఉట్నూర్ మండలాల్లో గాలివాన బీభత్సం సృష్టిం చింది. ఇండ్ల రేకులు ఊడి పోగా.. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. కల్లాల్లో ఆర బోసిన పంట ఉత్ప త్తులు తడిసిముద్దయ్యాయి. పలు లోతట్టు ప్రాం తాలు జలమయం అయ్యాయి. ఇంద్రవెల్లి మండలంలోని వాల్గొండా, వడగామ్, తేజాపూర్, సాలేగూడ, మోహన్‌సింగ్‌తండా, దస్నాపూర్, దోభిగూడ, గౌరాపూర్, పోల్లుగూడ, పాకిడిగూడ గ్రామాల్లో ఈదురు గాలులతోపాటు వడగాండ్ల వర్షం కురిసింది. మోహన్‌సిం గ్‌తండా, వడగామ్, వాల్గొండా గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. సాలేగూడ, వడగామ్, వాల్గొండా, పాకిడిగూడ గ్రామాల్లో పలువురి ఇండ్ల పైకప్పులు ఊడిపోయాయి. నిత్యావసర సరుకులతోపాటు విలు వైన సామగ్రి తడిసిపోయి నష్టం వాటిల్లింది. బజార్‌హత్నూర్ మండల కేంద్రంలో ఏకధాటిగా 15 నిమిషాలు వర్షం కురవడంతో మార్కెట్ యార్డు బయట కుప్పలుగా ఉంచిన జొన్నలు తడిచి ముద్దయ్యాయి. దీంతో రైతులు టార్పాలిన్‌లు కప్పారు. ఇచ్చోడ మండలంలోని అడిగామ నుంచి పిప్పిరి గ్రామానికి వెళ్లే రోడ్డు పై చెట్టు విరిగి పడింది. ఉట్నూర్, నార్నూర్, గాదిగూడ మండలాల్లో వర్షం కురియడంతో రైతు లు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పట్టణంలోని లోతట్టు ప్రాంతమైన అంబేద్కర్ చౌక్‌లోని పలు కాంప్లెక్స్‌లు, కళాశాల భవనాలలోకి నీరు చేరింది. పెర్కగూడ ప్రధాన రహదారిపై చెట్టు పడడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. పలు చోట్ల విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ఉట్నూర్ మండలంలోని గంగన్నపేట్, బిర్సాయిపేట్ గ్రామాల్లో ధాన్యం తడిసింది. కోత కొచ్చిన వరి నేల కొరిగింది. శ్యాంపూర్ గ్రామంలో భారీ గాలికి కరెంటు స్తంభాలు నేలకొరిగాయి. రేకుల ఇండ్ల పైకప్పులు గాలికి లేచి పోయాయి.

### సైకో వీరంగం..


## కత్తితో నర్సింగ్ అధికారి పై దాడి



విశ్వంభర, బీబీనగర్: యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రంలో మంగళవారం ఒక సైకో వీరంగం సృష్టించాడు. మండల కేంద్రంలోని పోచంపల్లి రోడ్డు చౌరస్తా వద్ద ఓ వ్యక్తి కత్తితో వీరంగం సృష్టించి ప్రజలను భయాందోళనలకు గురిచేశాడు. అటుగా వెళ్తున్న ఎయిమ్స్‌కు చెందిన నర్సింగ్ అధికారి పై అకస్మాత్తుగా కత్తితో దాడికి పాల్పడటంతో స్థానికంగా కలకలం రేగింది. స్థానికుల కథనం మేరకు అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తి ఒక్కసారిగా చేతిలో ఉన్న కత్తితో నర్సింగ్ అధికారి పై దాడి చేశాడు. దీంతో అక్కడ ఉన్న ప్రజలు భయంతో పరుగులు తీశారు. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే అప్రమత్తమై దుండగుడిని అడ్డుకుని పట్టుకున్నారు. అనంతరం అతడిని పోలీసులకు అప్పగించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. దాడిలో గాయపడిన నర్సింగ్ అధికారిని చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం. ప్రస్తుతం బాధితురాలి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటన పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## బాలికల విద్యాభివృద్ధికి కేజీబీవీలదే కీలక పాత్ర

### మంత్రి గడ్డం వివేక్



విశ్వంభర, రామచంద్రాపురం: విద్య, వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లో బాలికల విద్యాభివృద్ధికి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు (ఖ+దీఎ) ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నాయని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ డివిజన్ ఉస్మాన్ నగర్ పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో రూ.60 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న అదనపు తరగతి గది భవన నిర్మాణ పనులకు మంగళవారం మంత్రి వివేక్ వెంకటస్వామి, స్థానిక ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆర్థిక, సామాజిక కారణాలతో చదువుకు దూరమవుతున్న బాలికలకు ఉచిత విద్య, వసతి, భోజనం వంటి సౌకర్యాలు కల్పిస్తూ కేజీబీవీలు విద్యావకాశాలను చేరువ చేస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల విద్యార్థినులకు ఉన్నత విద్య దిశగా ముందుకు సాగే అవకాశాన్ని కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. బాల్య వివాహాలు, బాల కార్మిక సమస్యలను తగ్గించడంలో కూడా కేజీబీవీలు కీలకంగా మారాయని, గ్రామీణ ప్రాంతాల్లో బాలికల చదువుకు అండగా నిలుస్తూ వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్నాయని మంత్రి తెలిపారు. గత పది సంవత్సరాలుగా ఉస్మాన్ నగర్ కస్తూర్బా గాంధీ విద్యాలయ విద్యార్థులు పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ విద్యా రంగంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, నిర్మల జగ్గారెడ్డి, కాటా శ్రీనివాస్ గౌడ్, శ్యామ్ రావు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సుందరయ్య స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటం ఉధృతం చేద్దాం

### పేదల ఇల్లు, వీధి వ్యాపారుల అక్రమ తొలగింపులు ఆపాలి: సిపిఎం



విశ్వంభర, వనస్థలిపురం : పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటం చేద్దామని సిపిఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం చంద్రమోహన్ అన్నారు. మంగళవారం పుచ్చలపల్లి సుందరయ్య 41 వ వర్ధంతి సందర్భంగా ఎల్బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య..రాధమ్మ అధ్యక్షతన పూల మాలలు వేసి నివాళ్ళులు అర్పించారు. అనంతరం చంద్రమోహన్ మాట్లాడుతూ.. కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, అణగారిన వర్గాల ఆశా జ్యోతి , పేదలకు తినడానికి కట్టుకోవడానికి బట్ట ఉండటానికి ఇల్లు మౌలిక సదుపాయాల కల్పన కోసం పార్లమెంట్ లోను,బయట,ప్రజల పక్షాన నిత్య జీవితం పోరాటం చేసేవారని అన్నారు. ఆయన పిల్లలు పుడితే ఆస్తి మీద ప్రేమ పిల్లల మీద ప్రేమ పెరుగుతాదని, సుందరయ్య స్వయంగా పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకున్నారని గుర్తు చేశారు. నేటి రాజకీయాల్లో విలువలు లేని ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు ఉన్నారని కామ్రేడ్ సుందరయ్య గన్నవరం శాసనసభ్యుడిగా ప్రజల పక్షాన్ని నిలబడి విలువలతో కూడిన రాజకీయాలు చేసి కమ్యూనిస్టు పద్ధతులను అవలంబిస్తూ నిస్వార్థంగా ప్రజల కోసం జీవించారన్నారు. ప్రత్యామ్నాయం చూపకుండా తోపుడుబండ్లు అక్రమ తొలగింపులు, పేదల ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, హైవే రోడ్ల పైన వైన్స్ లను షాపులు తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భారతమ్మ కాశమ్మ, అర్జున్, మల్లేష్, ఝాన్సీ, కాశమ్మ, రాధమ్మ, శాంతి భాయ్, అంజి నాయక్, మల్లయ్య,నిర్మలమ్మ, కుమారి, కుద్విద్దీన్, రాములమ్మ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని మహిళ మృతదేహం



విశ్వంభర, కామారెడ్డి రూరల్ : కామారెడ్డి రైల్వే స్టేషన్‌లోని 1వ నంబర్ ప్లాట్‌ఫామ్‌పై ఉన్న సిమెంట్ బెంచ్ పై సోమవారం రాత్రి గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు కామారెడ్డి రైల్వే ఎస్సై సాధు లింబాద్రి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం సుమారు 25 నుంచి 30 సంవత్సరాల వయస్సు గల యువతి సిమెంట్ బల్లపై పడుకొని ఉండగా, అనారోగ్య కారణాలతో మృతి చెందినట్లు అనుమానిస్తున్నట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని పరిశీలించగా ఆమె ఒంటిపై పంజాబీ డ్రెస్ ధరించి ఉన్నట్లు తెలిపారు. ఫుల్ బ్లూ కలర్ టాప్, బ్లూ అండ్ వైట్ చెక్స్ ఉన్న దుస్తులు, టాప్ పై బ్లూ కలర్ షర్ట్, అలాగే రెడ్ కలర్ చున్నీ ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. ఆమె భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నట్లుగా కనిపిస్తోందని, అయితే ఎలాంటి గుర్తింపు కార్డులు లేదా ఐడీ ప్రూఫ్‌లు లభించలేదని తెలిపారు. మృతదేహాన్ని కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ గదిలోని ఫ్రీజర్‌లో భద్రపరిచినట్లు వెల్లడించారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు కామారెడ్డి రైల్వే స్టేషన్ ఎస్సై సాధు లింబాద్రిని సెల్ నంబర్ 87126 58614కు సంప్రదించాలని కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్సై తెలిపారు.

## రైతులందరూ ప్రకృతి వ్యవసాయం చేయాలి




విశ్వంభర, నడిగూడెం: మారుతున్న కాలానుగుణంగా ప్రతి రైతు తమ కుటుంబ ఆరోగ్య అవసరాల కోసం కనీసం అర ఎకరంలో అయినా ప్రకృతి వ్యవసాయం చేపట్టాలని తహసీల్దార్ సోంపంగు సూరయ్య పిలుపునిచ్చారు.మంగళవారం వల్లాపురంలో సిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన "ప్రకృతి వ్యవసాయ రైతు చైతన్య యాత్ర"ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత 65 ఏళ్లుగా కొనసాగుతున్న రసాయన వ్యవసాయం కారణంగా భూసారం దెబ్బతిన్నదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భూమి సారాన్ని పునరుద్ధరించాలంటే రైతులు పశువుల పెంట, చెరువు మట్టిని పొలాలకు తరలించాలని సూచించారు. తొలకరి వర్షాలు కురిసిన వెంటనే జీలుగ, పిల్లి పెసర, జనుము వంటి పచ్చిరొట్ట పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు.అనంతరం ఎస్ఐ గంధమళ్ళ అజయ్ కుమార్ మాట్లాడుతూ, కొంతమంది రైతులు వరి కొయ్యకాల తర్వాత పొలాల్లో మిగిలిన చెత్తకు నిప్పంటించడం వల్ల నేలలో పంటకు మేలు చేసే సూక్ష్మజీవులు నశిస్తున్నాయని తెలిపారు. "నేల ఆరోగ్యమే పంట ఆరోగ్యం, పంట ఆరోగ్యమే మన ఆరోగ్యం" అని ఆయన పేర్కొన్నారు.పల్లె దవాఖాన వైద్యాధికారి డాక్టర్ గార్లపాటి హరినాథ్ మాట్లాడుతూ, మనిషి జీవితం ప్రకృతితో ముడిపడి ఉందని, అందువల్ల ప్రతి రైతు సహజ సిద్ధ వ్యవసాయంపై ఆసక్తి చూపాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కేసగాని సరిత, పంచాయతీ కార్యదర్శి రణబోతు మల్లారెడ్డి, ఉప సర్పంచ్ కోట శేఖర్ రెడ్డి, డాక్టర్ కేసగాని లక్ష్మణ్, సిరి ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ మొలుగూరి గోపయ్య, ఆదర్శ రైతులు బజ్జూరి వీరారెడ్డి, బజ్జూరి అచ్చిరెడ్డి, పల్లా యుగేందర్ రెడ్డి, పల్లా వెంకటరెడ్డి, అప్పిరెడ్డి, నిండుచర్ల వెంకటేశ్వర్లు, దుస్సా వెంకటేశ్వర్లు, నారాయణ రెడ్డి, నూకపంగు వెంకన్న, నూకపంగు ఈదయ్య, రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రేట్లు పెంచాలని గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ డిమాండ్

### మే రెండో వారంలో నిరవధిక సమ్మెకు పిలుపు




విశ్వంభర, హైదరాబాద్ : తాపీ మేస్త్రీల మధ్యవర్తిత్వాన్ని తొలగించాలి అని సెంట్రింగ్ కాంట్రాక్టర్లను ఆర్థికంగా దెబ్బతీస్తున్న మధ్యవర్తుల వ్యవస్థను రద్దు చేసి, సెంట్రింగ్ పనులకు తగిన రేట్లు అమలు చేయాలని గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ డిమాండ్ చేశారు ."తాపీ మేస్త్రీలకు హటావో... సెంట్రింగ్ కాంట్రాక్టర్లకు బచావో" అనే నినాదంతో అసోసియేషన్ నాయకులు రత్లవత్ రాములు నాయక్, సంఘముల శ్రీనివాస్ కుర్మ (వైస్ ప్రెసిడెంట్), వి. సంతోష్ నాయక్, దేవేందర్, శేఖర్, రమేష్, మధు, లక్ష్మణ్ ఠాగూర్ మాట్లాడుతూ 2016లో సెంట్రింగ్ పనులకు ఎస్.ఎఫ్.టి కి రూ.40గా నిర్ణయించామని, ప్రతి సంవత్సరం ఒక రూపాయి చొప్పున పెంచాలని తీర్మానించినప్పటికీ ఇప్పటివరకు అమలు కాలేదని తెలిపారు. ప్రస్తుతం ఉన్న రేట్లు కూడా తీవ్రంగా పడిపోయి కాంట్రాక్టర్లు నష్టాల్లో కూరుకుపోయారని పేర్కొన్నారు. మొలలు, చెక్కలు, వాల్ ప్లేట్లు, ట్రాన్స్‌పోర్ట్, లోడింగ్-అన్‌లోడింగ్ ఖర్చులు, కార్మికుల కూలీలు భారీగా పెరిగినా సెంట్రింగ్ రేట్లు పెరగకపోవడం అన్యాయమని ఆరోపించారు.

లక్షల రూపాయల పెట్టుబడులు పెట్టి వర్కర్లకు అడ్వాన్స్‌లు ఇచ్చి పని చేస్తున్న కాంట్రాక్టర్లు కుటుంబాలను పోషించుకోవడమే కష్టంగా మారిందన్నారు.తాపీ మేస్త్రీలు సెంట్రింగ్ పనులను తమ రేట్లలో కలుపుకొని మాట్లాడటం వల్లే సెంట్రింగ్ కాంట్రాక్టర్ల రేట్లు దిగజారుతున్నాయని సంఘం ఆరోపించింది. ఎలక్ట్రిషియన్, ప్లంబర్, కార్పెంటర్‌లతో బిల్డర్లు నేరుగా ఒప్పందాలు చేసుకున్నట్లే సెంట్రింగ్ కాంట్రాక్టర్లతో కూడా డైరెక్ట్‌గా మాట్లాడాలని కోరారు. సెంట్రింగ్ పనులు పెట్టుబడితో కూడుకున్నవని, నైపుణ్యం కలిగిన కార్మికులు అవసరమవుతారని, మేస్త్రీలు మధ్యవర్తులుగా వ్యవహరించడం వల్ల బిల్డర్లు కాంట్రాక్టర్లిద్దరికీ నష్టం జరుగుతోందని తెలిపారు.

## చివరి గింజ వరకు కొంటాం రైతులు అధైర్య పడొద్దు

విశ్వంభర, బీబీనగర్: పిలాయిపల్లి గ్రామంలోని ఇంద్రాకిలాద్రి రైస్ మిల్లును నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ బీబీనగర్ మండలం రుద్రవెల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ, రైతులకు అందుతున్న సౌకర్యాలు, ధాన్యం తరలింపు పరిస్థితులను సంబంధిత అధికారులతో కలిసి క్షుణ్ణంగా పరిశీలించారు.అనంతరం కేంద్రాల వద్ద ఉన్న రైతులతో ఎమ్మెల్యే మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే రైస్ మిల్లర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని, కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి అక్రమాలకు పాల్పడవద్దని హెచ్చరించారు.అందుబాటులో ఉన్న ఖాళీ స్థలాలను వినియోగించి ధాన్యం నిల్వ ప్రక్రియ చేపట్టాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.ప్రతి రైస్ మిల్లు, ఐకేపీ, పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.హమాలీలు, లారీల కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుని, ధాన్యం తరలింపు ప్రక్రియలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.అక్కడక్కడ ఎదురవుతున్న సమస్యలను అన్ని శాఖల సమన్వయంతో పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగానే ధాన్యం ఎగుమతి సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. భారతీయ జనతా పార్టీ నాయకులు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

# రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రతీ గింజను కొనుగోలు చేయాలి: బండ శ్రీనివాస్

విశ్వంభర, చిగురుమామిడి :రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన పంటను కొనుగోలు చేయకుండా అరిగోస పెడుతుందని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బండ శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్ జిల్లా హుజురాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు కష్టపడి పండించిన పంటను కొనుగోలు చేయకుండా ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. క్వింటాల్ వరి ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని ప్రగల్బాలు పలికిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం కనీసం పండించిన పంటను కూడా కొనుగోలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కల్లాల మీదే ధాన్యం కొనుగోలు చేసేవారని గుర్తు చేశారు. ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్న ప్రైవేట్ వ్యాపారులు కొర్రీలు పెడుతూ ఒక్కో బస్తా మీద నాలుగు నుంచి ఐదు కిలోల తరుగు తీయడంతో పాటు ధాన్యానికి ప్రభుత్వ మద్దతు ధర చెల్లించడం లేదని అన్నారు. ప్రభుత్వం వహిస్తున్న అలసత్వం వల్ల రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, పలువురు రైతులు మానసిక క్షోభకు గురై ఆత్మహత్యకు కూడా పాల్పడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. ఎద్దు ఏడ్చిన యవుసం రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడిన చరిత్ర లేదనే సత్యాన్ని గ్రహించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా కళ్ళు తెరిచి వెంటనే రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలని, లేని పక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.